కొండవాలులో జిగేలు

కంచరపాలెం, బర్మా క్యాంప్, ఊర్వశి కూడలి తదితర కొండవాలు ప్రాంతాలు సరైన విద్యుత్ సౌకర్యం లేక చీకట్లలో మగ్గిపోయేవి. పగలు ఎలాగోలా గడిపేసినా.. చీకటి పడేసరికి ఎక్కడికైనా వెళ్లాలంటే స్థానికులు భయపడిపోయేవారు. ఈ సమస్యపై దృష్టి సారించిన ప్రభుత్వం ఒకేసారి 260 సరికొత్త విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి కొండవాలు ప్రజల కష్టాలకు చెక్ పెట్టింది. కొత్త విద్యుత్ దీపాలు, వైర్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల అమరికతో కొండవాలు ప్రాంతం ఇప్పుడు నిత్యం వెలుగులు విరజిమ్ముతోంది.

- చీకట్లను చీల్చుతూ ఒకేసారి 260 సరికొత్త విద్యుద్దీపాల ఏర్పాటు
- కంచరపాలెం, బర్మా క్యాంప్, ఊర్వశి కూడలికి కొత్త వెలుగులు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



జైభారత్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలకు కొత్త వైర్లు అమర్చుతున్న సిబ్బంది



శివలింగపురంలో కొత్త సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



బాపూజీనగర్‌లో కొత్త ఎల్‌ఈడీ లైట్ల అమరిక



న్యూశ్రీనివాసనగర్‌లో హైమాస్ట్ లైట్ల వెలుగులు

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం, బర్మా క్యాంప్, ఊర్వశి కూడలి తదితర కొండవాలు ప్రాంతాల్లో సుమారు 260 సరికొత్త విద్యుత్ లైట్లను అధికారులు ఏర్పాటు చేశారు. దాదాపు కొండవాలు ప్రాంతాల్లో 93 శాతం వీధిలైట్లు వెలగడంతో ఊర్వశి కూడలి నుంచి కంచరపాలెం కొండవాలు ప్రాంతం అంతా విద్యుత్ కాంతులతో మెరుస్తూ.. రహదారులు, మెట్ల మార్గాలు సుందరంగా కనిపిస్తున్నాయి. స్టాండింగ్ కమిటీ సమావేశంలో తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలు, వీధిలైట్ల సమస్యను సభ్యులు లేవనెత్తడంతో ఏపీఈపీడీసీఎల్ అధికారులు, జీవీఎంసీ విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. బర్మా క్యాంప్, ఇందిరానగర్-1 నుంచి 5, జైభారత్‌నగర్, శివలింగపురం, శ్రీనివాస్‌నగర్, శివనగర్, జవహర్‌లాల్‌నగర్, బాపూజీనగర్ ప్రాంతాల్లో రహదారులు, మెట్లమార్గాల్లో వీధి లైట్లు సక్రమంగా వెలిగేవి కావు. తుప్పుపట్టి ఇనుప స్తంభాలు ఎప్పుడు పడిపోతాయా అన్నట్లు ఉండేవి. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండేవి. దీంతో నాడు ఈ ప్రాంతాలన్నీ అంధకారంలో ఉండేవి. నేడు కొండవాలు ప్రాంతాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీంతో తమ సమస్య పట్ల త్వరితగతిన స్పందించి పరిష్కరించిన ప్రభుత్వానికి స్థానికులు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు

- కొండవాలు ప్రాంతాల్లోని జైభారత్‌నగర్, ఇందిరానగర్-1లో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.
- ప్రధాన రహదారుల్లో సుమారు రూ. 1.3 లక్షలతో 7 రౌండ్ పోల్స్ (సిమెంట్ స్తంభాలు), వాటికి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు.
- బర్మా క్యాంప్ శ్రీనివాసనగర్, శివనగర్ ప్రాంతాల్లో మరో రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు నిధులు మంజూరు అయ్యాయి. మరో నాలుగు రోజుల్లో పనులు ప్రారంభించనున్నారు.
- హెచ్‌డీ, కేవీ విద్యుత్ తీగల తొలగింపు, కొత్త వైర్ల అమరిక జరిగింది.
- సుమారు రూ.7.50 లక్షలతో 40 వాల్టుల విద్యుత్ లైట్లు 135, 76 వాల్టుల విద్యుత్ లైట్లు 92 ఏర్పాటు చేశారు.
- ఆయా ప్రాంతాల్లో సుమారు 45 వీధిలైట్ల మానిటరింగ్ బాక్స్‌ల పునరుద్ధరణ
- ఈ విధమైన చర్యలతో తమ ప్రాంతం నిత్యం వెలుగులు విరజిమ్ముతుండటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చీకట్ల నుంచి విముక్తి



విద్యుద్దీపాలు లేక మా ప్రాంతంలో చీకటి పడితే ఇబ్బంది పడేవాళ్లం. అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో ఆ బాధలు తప్పాయి. వీధిలైట్లు వెలగడంతో రహదారులన్నీ వెలుగులు విరజిమ్ముతున్నాయి. రాత్రి పూట కూడా ఎక్కడికైనా సులువుగా ప్రయాణం చేయగలుగుతున్నాం.

– పద్మ, ఇందిరానగర్

మెట్లమార్గంలో సాఫీగా నడుస్తున్నాం



గతంలో కొండవాలు ప్రాంతంలో చీకట్లో నడిచి వెళ్లాలంటే భయపడేవాళ్లం. నేడు ప్రతి వీధిలో లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మెట్ల మార్గాలన్నీ కాంతులతో కనిపిస్తున్నాయి. ప్రభుత్వం మౌలిక వసతులు బాగా కల్పిస్తోంది.

– బి. కిషోర్‌కుమార్, బాపూజీనగర్

దోమల నియంత్రణకు మెగా ఫాగింగ్



అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లో మెగా ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డులోని పలు ప్రాంతాల్లో దోమల నియంత్రణకు మంగళవారం సాయంత్రం మెగా ఫాగింగ్ నిర్వహించారు. బోరవారి వీధి, లలితానగర్, చాకలిపేట, రామకృష్ణానగర్, శంకువానిపాలెం, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, 80 అడుగుల రోడ్, చిన్నూరు, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతాల్లో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది మెగా ఫాగింగ్ నిర్వహించారు. నీరు నిల్వ లేకుండా వారానికి ఒకరోజు డ్రై డే పాటించాలని, తద్వారా దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని స్థానికులకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ సిబ్బంది కె.శివ సత్యనారాయణ, ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు

కంచరపాలెం : రవీంద్రనగర్‌లో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో వైశాఖ శుద్ధ పంచమిని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామం, విభూది, పుష్పాలతో స్వామికి అర్చకులు రామకృష్ణశర్మ అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

క్లుప్తంగా

ఘనంగా పైడి తల్లమ్మ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న రెయ్యి వెంకటరమణ తదితరులు

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మహత్ కాలనీలో వెలసిన పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో బీవీకే విద్యార్థుల సత్తా



ర్యాంకర్లను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సీతంపేట : స్థానిక బీవీకే కళాశాల విద్యార్థులు ఇటీవల విడుదలైన డిగ్రీ ఫలితాల్లో ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. బీకాంలో సుంకరి సోమలిక మొదటి ర్యాంకు, బీఏలో కొనేయ దేదీప్య రెండవ ర్యాంకు, బి. రిషితనాయుడు మూడవ ర్యాంకు సాధించి టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ పట్టాభి రామారావు, డైరెక్టర్ అంజలి ప్రసాద్, కోశాధికారి వై.శ్రీధర్, పరిపాలన అధికారి కె.ఏ.వి.కృష్ణమాచార్యులు, ప్రిన్సిపాల్ టి.గోవిందరావు అభినందించారు.

చురుగ్గా డ్రెయిన్ నిర్మాణం



43వ వార్డులో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్

సీతంపేట : జీవీఎంసీ 43వ వార్డు శ్రీనగర్‌లో డ్రెయిన్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. 80 అడుగుల రోడ్ ఆర్చి నుంచి శ్రీనివాసనగర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న పాత డ్రెయిన్లు శిథిలమవడంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సమస్యను స్థానికులు వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ దృష్టికి తీసుకెళ్లడంతో కొత్త డ్రెయిన్ల నిర్మాణానికి గతంలో నిధులు మంజూరు చేశారు. కొద్ది రోజుల నుంచి పాత డ్రెయిన్లు తొలగించి వాటి స్థానంలో కొత్తగా సీసీ డ్రెయిన్ నిర్మిస్తున్నారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యూజీడీ లీకుతో ఇబ్బందులు



మధురానగర్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ 49-26-6 నంబరు గల ఇంటి వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ రెండు వారాలుగా లీకవుతోంది. దీంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికులతో పాటు ఆ వైపుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా దుర్గాలమ్మ జాతర




ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ అమ్మవారు



భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు శర్మ

కంచరపాలెం : దుర్గానగర్ గొల్ల కంచరపాలెం ప్రజల ఆరాధ్య దేవత, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన దుర్గమాంబ అమ్మవారి జాతర శ్రీరామ సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలతో భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పించారు. అలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె. రాజు, మాజీ ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీనగర్, గవర కంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశి కూడలి, దయానంద నగర్, గోకుల్‌నగర్, ఐటీఐ కూడలి, తాటిచెట్లపాలెం, కరాసా, ఎన్ఏడీ, గోపాలపట్నం ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలు, మజ్జిగలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. సాయంత్రం అమ్మవారి ప్రతిమలతో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. సుమారు 34 ఘటాలను ఆలయం వద్దకు చేర్చారు. కోలాటం, తప్పెటగుళ్లు, చిడతలు, నేల వేషాల నడుమ అమ్మవారిని ఊరేగించి ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఐదవ పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కనుల పండువగా రామలింగేశ్వరుని కల్యాణం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



రామలింగేశ్వరుని కల్యాణం జరిపిస్తున్న ఆలయ అర్చకులు

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో కొలువైన రామలింగేశ్వరుని వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈవో జి.వి. రమాబాయి పర్యవేక్షణలో అర్చకులు శాస్త్రోక్తకంగా స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిపించారు. సుమారు 300 మంది దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. ముందుగా స్వామి వారి పల్లకీ ఊరేగింపు పురవీధుల్లో వైభవంగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ద్రోణంరాజు శ్రీవత్సవ్, బొడ్డేటి కిరణ్, కాళ్ల సూర్యప్రకాష్, పాండవ ఈశ్వరరావు, అమ్మాజీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాహితీ సౌరభం

1966లో దొండపర్తిలోని నెహ్రూబజార్ సమీపంలో స్థాపించబడిన ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం తదనంతర కాలంలో ఆ పక్కనే ఉన్న పాఠశాల మేడ మీదకు మార్చారు. ఈ గ్రంథాలయంలో నవలలు, చిన్న పిల్లలు ఇష్టపడే కథల పుస్తకాలు, కామిక్స్, పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు అవసరమయ్యే సైన్స్, మ్యాథ్స్ వంటి అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వేసవిలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు, నవంబర్‌లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి.. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్నారు.

- చక్కటి సేవలందిస్తున్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం
- పాఠకులకు అందుబాటులో 80 వేల పుస్తకాలు
- పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ప్రాధాన్యం



గ్రంథాలయంలో పాఠకులు



నెహ్రూబజార్‌లో గల ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం

సీతమ్మధార: దొండపర్తిలో ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం సాహితీ సౌరభాలు వెదజల్లుతోంది. 1966లో ఈ గ్రంథాలయాన్ని స్థాపించారు. ఇక్కడ దాదాపు 80 వేల వరకు వివిధ రకాల పుస్తకాలున్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడే అనేక పుస్తకాలను ఇక్కడ పొందుపరిచారు. అలాగే పాఠకులు ఇష్టపడే నవలలు, పిల్లలకు నచ్చే కామిక్స్, రంగు రంగుల కథల పుస్తకాలు ఇక్కడున్నాయి. అలాగే రాజకీయ శాస్త్రం, ఇంజినీరింగ్, న్యాయశాస్త్రం, పలువురు ప్రముఖుల జీవిత చరిత్రలు ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. తెలుగు అకాడమీ పుస్తకాలు, హిందీ చదువరుల కోసం పలు రకాల గ్రంథాలు ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. ఈ గ్రంథాలయం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తుంది. రోజూ ఇక్కడికి వందకు పైగా విద్యార్థులు, పాఠకులు వస్తుంటారు. గ్రంథాలయ కర్తలు పైడిరాజు, వీఏ పద్మావతిదేవి పర్యవేక్షణలో సిబ్బంది ఇక్కడ సేవలు అందిస్తున్నారు. ప్రతి గురువారం, రెండో శనివారం సెలవు దినంగా పాటిస్తున్నారు. ఈ గ్రంథాలయంలో ఏడు వేల మంది సభ్యత్వం కలిగి వున్నారు.

వేసవి శిక్షణ శిబిరం..

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు ఇక్కడ రోజూ ఉదయం పూట స్పోకెన్ ఇంగ్లీష్, కథా పఠనం, పాటల వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. జూన్ 7వ తేదీన జరిగే ముగింపు ఉత్సవంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. పాండిచ్చేరి యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న విజయనగరం జిల్లాకు చెందిన విజయలక్ష్మి ఈ గ్రంథాలయానికి 160 పుస్తకాలు విరాళంగా అందజేశారు. జేడీ ఫౌండేషన్ యాజమాన్యం మూడు టేబుళ్లు, 20 కుర్చీలు, మూడు ఫ్యాన్లు, నాలుగు ట్యూబ్ లైట్లు విరాళంగా అందించారు.



ర్యాకుల్లో అందంగా అమర్చి ఉన్న పుస్తకాలు



గ్రంథాలయకర్త పద్మావతీదేవి

ఇక్కడ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయిన దాదాపు 30 మంది యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ ఏటా నవంబర్‌లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తుంటారు.

హైకోర్టులో ఉద్యోగం వచ్చింది



దొండపర్తి ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు చదివి పరీక్షలకు హాజరయ్యాను. మంచి మార్కులు సాధించటంతో హైకోర్టులో ఉద్యోగం వచ్చింది. గ్రంథాలయ అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాను. ఇక్కడ ప్రతి విద్యార్థికి ఉపయోగపడే పుస్తకాలున్నాయి. అలాగే సాహిత్యం, కామిక్స్, పిల్లల కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. –జగన్‌మోహన్

అందుబాటులో 80 వేల పుస్తకాలు



ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో 80 వేల వరకు పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలు, జనరల్ నాలెడ్జి బుక్స్ విద్యార్థుల కోసం ఇక్కడ పొందుపరిచాం. ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు చదువుకుని ఎంతో మంది ఉద్యోగాలు సంపాదించారు. గ్రంథాలయ సేవలను పాఠకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

–వీఏ పద్మావతిదేవి, లైబ్రేరియన్,

వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానం

ఎంవీపీ కాలనీ: జిల్లా స్థాయి రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వం రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని ఏటా మే 28న నిర్వహిస్తుందన్నారు. రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమన్నారు. ఆ సమయంలో మహిళల్లోని అపోహలు, అభద్రత భావాన్ని తొలగించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అంశంపై బాలికల్లో అవగాహన పెంచేందుకు పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు జరగాలన్నారు. రుతుక్రమ సమయంలో పరిశ్రుత పాటించకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో బాలికలు, మహిళలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థకు రామాయణమే మూలం



మాట్లాడుతున్న రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు

సీతంపేట : భారతీయ కుటుంబ వ్యవస్థ.. రామాయణం అనే అంశంపై మంగళవారం ప్రసంగ కార్యక్రమం జరిగింది. భారతీయ శిక్షణ్ మండల్ నిర్వహణలో స్థానిక బీవీకే కళాశాలలో చెరుకూరి సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రధాన వక్తగా మాట్లాడారు. మన కుటుంబ వ్యవస్థ సమాజానికి బలమైన ప్రాకారమని, ప్రపంచంలో ఎక్కడా ఇటువంటి వ్యవస్థ లేదని తెలిపారు. కాలక్రమంలో ఇక్కడ కూడా అనుబంధాలు పతనమవుతున్నాయన్నారు. రామాయణం ప్రాచీన కుటుంబ వ్యవస్థకు మూలమని తెలిపారు. రామాయణంలోని అన్నదమ్ముల అనుబంధం సమాజానికి ఆదర్శమని, అయోధ్య, లంక, కిష్కింధల్లో భిన్న సంస్కృతులు ఉన్నాయన్నారు. సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, కొత్తూరు రమణ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మద్రిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆటోలో అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. దీనిపై పోలీసులందించిన వివరాలిలా.. రామ్మూర్తి పంతులుపేట (ఆర్పీపేట) పవర్ స్టేషన్ పక్కన ఉన్న పార్కు వద్ద ఆటోలో మంగళవారం బోర దివాకర్ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సదరు మృతుడు కొంతకాలంగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. అలాగే తల్లి దగ్గర కొంతకాలం ఉన్నాడు. తర్వాత విభేదాలు రావడంతో వారికి కూడా దూరంగా ఉంటూ బయట గడుపుతున్నాడు. ఇతడికి మద్యం సేవించే అలవాటు ఉంది. మద్యం ఎక్కువ సేవించడం వల్ల మృతి చెందాడా, ఆహారం లేక మరణించాడా, మరే ఇతర కారణాల వల్ల మృతి చెందాడా అన్న విషయమై పోలీసులు విచారణ చేపట్టారు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

వేడుకగా కనక దుర్గమ్మ మారువారం పూజలు



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో కనక దుర్గమ్మ అమ్మవారు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో వెలసిన గ్రామ దేవత శ్రీ బెజవాడ కనకదుర్గమ్మ అమ్మవారి మారువారం పూజలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

మురళీనగర్/సీతంపేట : స్వర్గీయ నందమూరి తారక రామారావు 101వ జయంతి 50వ వార్డు టీడీపీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 26వ వార్డు టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి జరిగింది.